# ఇన్లాండ్ లెటర్ కథలు

## చేను మేసిన కంచె

రిటైర్డ్ స్కూలు మాస్టరు జానకిరామయ్య గారి సంతానంలో కడసారిదైన జ్యోతి బి.ఎ. పాసయి ఒక ప్రైవేటు కంపెనీలో టైపిస్ట్‌గా పనిచేస్తోంది. జ్యోతి కంటే పెద్దవాళ్లయిన ఇద్దరాడ పిల్లల పెళ్ళిళ్ళు చేసేసరికి జానకిరామయ్యగారు అప్పులతో తలమునకలయి పోయారు. తండ్రి పడుతున్న ఆర్థిక ఇబ్బందులు చూసి "తన పెళ్ళి కొన్నాళ్లకి వాయిదా వేసుకుని" తండ్రికిష్టం లేకపోయినా ఎలాగో సర్ది చెప్పకుని ఉద్యోగంలో ప్రవేశించింది జ్యోతి. ఆడపిల్లచేత ఉద్యోగం చేయించడం తమ కుటుంబంలో అలవాటు లేని కారణంగా "జ్యోతి ఆఫీసుకి బయలుదేరుతున్న ప్రతిరోజూ" ఆఫీసు వదయిపోయిన వెంటనే ఇంటికి వచ్చెయ్యమని జానకిరామయ్యగారు, భార్య వెయ్యి జాగ్రత్తలు చెబుతుంటారు జ్యోతికి. ఎలాగో తంటాలుపడి జ్యోతికి కూడా త్వరలో పెళ్ళిచేసేసి తమ బాధ్యత తీర్చుకుందామని ఆ దంపతుల ఆరాటం.

ఒకరోజు జ్యోతి స్నేహితురాలు తన పుట్టిన రోజు పార్టీకి రమ్మని జ్యోతిని ఆహ్వానించింది. వెళ్లక తప్పలేదు జ్యోతికి. సాయంత్రం నేను రావడం ఆలస్యం అవుతుంది గాభరా పడొద్దని ఇంట్లో చెప్పి, ఆఫీసు నుండి అలాగే వెళ్లిపోయింది పార్టీకి. రాత్రి డిన్నర్ అయిన తరువాత పదకొండు గంటలకి ఇంటికి బయలుదేరుతున్న జ్యోతితో "అసలే చీకటి రాత్రులు" ఒక్క దానివీ ఇంత రాత్రప్పుడు వెళ్లొద్దు, రేపుదయాన్నే వెళ్లిపోదువు గానిలే! అని స్నేహితురాలి తల్లి చెప్పింది జ్యోతికి. వుండలేనాంటీ! నేనెంత రాత్రికయినా సరే ఇంటికెళ్లకపోతే అమ్మా, నాన్నగారు గాభరాపడతారు. స్ట్రీట్‌లైట్లు వీధుల్లో వెలుగుతుంటాయి గదా! పోలీస్‌స్టేషన్ పక్కనుండి వెళ్లిపోతే భయమేమీ వుండదు! అని చెప్పి బయలుదేరింది జ్యోతి.

పోలీసుస్టేషను దగ్గరికి వచ్చేసరికి, స్టేషన్‌లో బెంచిమీద కునుకుపాట్లు పడుతున్న పోలీసు అర్థరాత్రి ఒంటరిగా ఆడపిల్ల అటు వైపు రావడం చూసి చటుక్కున తెలివితెచ్చుకుని, సంతోషంగా కళ్లు పెద్దవిచేసి చూస్తూ, ఏయ్ పిల్లా ఆగు! ఎక్కడి నుండి వస్తున్నావు? అంటూ జ్యోతిని అధికార



పూర్వకంగా అడ్డగించాడు. తనెవరో, ఎక్కడ నుండి వస్తోందో చెప్పింది జ్యోతి. ప్రతిరోజూ నీలాంటి సీతాకోక చిలకల్ని, కాలేజీ బ్యూటీల్ని లాడ్జిల్లో రైడింగ్ చేసి పట్టుకుంటున్న నేను నీకల్లబొల్లి కబుర్లు నమ్మి నిన్నొదిలెస్తాననుకుంటున్నావా? చిలకా? పద స్టేషన్‌లోకి! ఒక్క పావుగంట నేను చెప్పినట్టు విన్నావంటే, నీ దారిన నువ్వు పోవచ్చు! వినకపోయావంటే రైడింగ్ కేసులో తోసి నిన్ను మూడు చెరువుల నీళ్లు తాగించగల్ను జాగ్రత్త! అంటూ జ్యోతి జబ్బ పట్టుకుని లోపలకి లాక్కుపోయాడు పోలీసు. అన్నా! నేనలాంటిదాన్ని కాను! దయచేసి నామాట నమ్మి నన్నొదిలి పెట్టన్నా! నీకాళ్లకి మొక్కుతానన్నా! అని హృదయ విదారకంగా అరుస్తోంది జ్యోతి. ఇలాంటి అరుపులు, తగువులు పోలీస్‌స్టేషన్లో మామూలే అని, జ్యోతి ఆర్తనాదాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదు. పోలీసు స్టేషను పక్కనుండి వెళ్లిపోతే సురక్షితంగా ఇల్లు చేరుకోవచ్చునసే జ్యోతి నమ్మకం వమ్మయిపోయి, పోలీసు ఇనుప పంజాలో చిక్కి శీలం పోగొట్టుకుంది జ్యోతి. రక్షకభటుడనుకున్న వాడే భక్షకభటుడయ్యాడనుకుంది. కంచే చేను మేసింది.

అర్థరాత్రి ఆడపిల్ల ఒంటరిగా తిరిగి, క్షేమంగా ఇల్లుచేరినప్పుడే మనకి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందనుకోవాలి! అన్న గాంధీజీ నమ్మకం వమ్మాయిపోయిందని, మన భారతదేశాన్ని వుద్ధరించడానికి ఎందరు రాజీవులు, ఎందరు విశ్వనాథులు, మరెందరు నారసింహులు, ఎందరు ఇంద్రకుమారులు కంకణం కట్టుకున్నా ఒంటరి ఆడదాని జీవితం ఇంతే! అనుకుంటూ భారతమాత మౌనంగా అశ్రుకణాలు రాల్చింది.

వి.రాజేశ్వరి
దుర్గ్, మధ్యప్రదేశ్

## టెస్ట్

అందమైన అమ్మాయి నవ్వులా ఫోన్ మ్రోగింది.

రిసీవర్ ఎత్తి "హలో" అన్నాడు బట్టల షాపు మేనేజర్.

"నేను" అంటూ అవతల పరిచయమున్న ఓ కంఠం

గుర్తుపట్టాక "నమస్కారమండీ" అన్నాడు మేనేజర్ అప్రయత్నంగా.

"ఎలా వుంది మన వ్యాపారం?"

"బాగుంది. ఈ టవునులో మనదే నెంబరు వన్ షాపు. ఈ పండక్కి డిస్కౌంట్ పెట్టి, మంచి పబ్లిసిటి కూడా యిచ్చాం. కానీ...! అంటూ ఆగాడు.



"ఈకానీ ఏమిటి?"అవతలి గొంతు

"మనకు సిబ్బంది తక్కువ. వచ్చేది ఫెస్టివల్ సీజన్. మన సరుక్కి డిమాండ్ వుంటుంది. అందుకని అదనంగా ఇద్దరు, ముగ్గురు కుర్రాళ్ళుంటే మంచిదని నా అభిప్రాయం" మేనేజర్ అభ్యర్థన.

"ఆ విషయమే మీకు చెబుదామని ఇప్పుడు నేను ఫోన్ చేసింది. నిన్న ఇద్దరు కుర్రాళ్ళు వచ్చారు. వాళ్ళను ఇంటర్వ్యూ చేశాను. ఈరోజు షాపుకు వెళ్ళమని చెప్పాను. వాళ్ళ ప్రవర్తన ఎలా గుందో కాస్త పసిగట్టు." ఇంకా వ్యాపార లావాదేవీలు గురించి బాస్‌తో సుదీర్ఘంగా మాట్లాడాక చివరికి "అలాగే" నంటూ ఫోను పెట్టేశాడు మేనేజర్.

ఇంతలో ఇద్దరు కుర్రాళ్ళు మేనేజర్ దగ్గరకు వచ్చి పరిచయం చేసుకున్నారు. వాళ్ళకు కొన్ని ప్రాథమిక సూత్రాలు చెప్పి పనిలో పెట్టాడు మేనేజర్.

మధ్యాహ్నం అయ్యేసరికి షాపులో రద్దీ పెరిగింది. ఇంతలో ఒక మోడ్రన్ యువతి మారుతీకారులోంచి దిగి, లోనికి చొచ్చుకుంటూ వచ్చింది. ఆమె నల్ల కళ్ళద్దాలు ధరించింది. లిప్‌స్టిక్ రాసుకున్న పెదాలు మాత్రం మెరుస్తున్నాయి.

కొత్తగా వచ్చిన కుర్రాళ్ళ దగ్గరకు వెళ్ళి అవీ, ఇవీ చూపించమంటూ మూడు చెరువుల నీళ్ళను త్రాగిస్తోంది. వాళ్ళకు చేదోడు వాదోడుగా మేనేజర్ వ్యవహరిస్తున్నాడు. కుర్రాళ్ళు చాలా ఓర్పుతో ఆమె కోరిన బట్టలన్నీ చూపిస్తున్నారు. చివరకు ఒక కర్చీఫ్ కొని ఆవిడ బైట పడేసరికి సాయంత్రం నాలుగయింది.

ఆరు గంటలకు ఫోను గలగలమంటూ మ్రోగింది. "హలో" అని మేనేజర్ ఎత్తాడు. "కుర్రాళ్ళ ప్రవర్తన బాగుందనుకుంటాను. ఇందాక మోడ్రన్ డ్రస్సులో వచ్చింది నేనే!" అని మిసెస్ దుర్గ చెబుతుంటే ముసిముసి నవ్వులు చిందిస్తూ ఫోను పెట్టేశాడు మేనేజర్ రాజారావు.

జి.సూర్యనారాయణరావు,
బందలాయిచెరువు, కృష్ణా